

డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజి నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 4000, మధ్య డెల్టాకు 260, పశ్చిమ డెల్టాకు 5000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



వనదుర్గకు చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు.

రూపులమ్మకు సారె



ఏలేశ్వరం: ఏలేశ్వరం గ్రామదేవత రూపులమ్మ అమ్మవారికి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల సభ్యులు శుక్రవారం 108 రకాల పిండి వంటలతో సారె సమర్పించారు.

న్యూస్‌రీల్

రేపటి నుంచి దక్షిణ భారత బిలియర్డ్స్, స్నూకర్ పోటీలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): భారతం లక్ష్మీపతి సోమయాజుల స్మారకార్థం ఆదివారం నుంచి 23వ తేదీ వరకూ దక్షిణ భారత బిలియర్డ్స్ అండ్ స్నూకర్ చాంపియన్‌షిప్–2023 నిర్వహిస్తున్నట్లు టౌన్‌హాల్ కమిటీ అధ్యక్షులు జి.సత్యనారాయణ మూర్తి (నానాజీ) తెలిపారు. శుక్రవారం టౌన్‌హాల్‌లో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఏపీ బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ టోర్నీని కాకినాడ టౌన్‌హాల్, కాస్మోపాలిటన్ క్లబ్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నెల 23న సాయంత్రం 6 గంటలకు ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందిస్తారన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు వారి ఎంట్రీలను అసోసియేషన్ కార్యదర్శి కస్తూరి సోమేశ్వరరావుకు అందించాలని కోరారు.

బెండపూడి చెక్‌పోస్టు వద్ద ఇకపై డిజిటల్ చెల్లింపులు

తొండంగి: పదహారో నంబర్ జాతీయ రహదారిపై మండలంలోని బెండపూడి ఆర్టీఏ చెక్ పోస్టు వద్ద ఇకపై డిజిటల్ చెల్లింపులు చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఎస్.విఠల్ శుక్రవారం తెలిపారు. ఏపీ రవాణశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వాహనాలకు విధించే రవాణా రుసుముతో పాటు బోర్డర్ ట్యాక్స్, టెంపరరీ, పర్మినెంట్ ఫీజులు, వలంటరీ ట్యాక్స్ వంటివి ఇకపై డెబిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్, ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, యూపీఐ, క్యూఆర్ కోడ్ స్కానర్ వంటి వాటి ద్వారా చెల్లించవచ్చన్నారు. నగదు రహిత విధానంలో చెల్లింపులు జరిపేలా మార్గదర్శకాలు అందాయన్నారు. వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బియ్యం, పప్పుల ధరలు నియంత్రించండి : జేసీ

కాకినాడ సిటీ: మార్కెట్లో పెరుగుతున్న బియ్యం, పప్పు దినుసుల ధరలను అదుపులోకి తీసుకొచ్చి ఆ ధరలను ప్రజలకు అనుకూలంగా మార్కెట్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జేసీ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ వర్తకులు, సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. బియ్యం, కందిపప్పు ధరలను మార్కెట్ ధరల కంటే తక్కువకు అమ్మేలా చూడాలన్నారు. బీపీడీ బియ్యం రిటైల్ రేటు కిలో రూ.52 ఉందని దానిని రూ.46కు, కిలో రూ.142 ఉన్న కందిపప్పును రూ.136కు అందించేందుకు మిల్లర్లు, హోల్‌సేల్ వర్తకులు అంగీకరించారన్నారు. ఈ ధరలతో ఈనెల 15 నుంచి కాకినాడలోని రెండు రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయించనున్నట్టు జేసీ వివరించారు. బియ్యం, కందిపప్పులకు కృత్రిమ కొరత సృష్టిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. సంబంధిత అధికారులు విధిగా తనిఖీలు నిర్వహించి, దాడులు చేయాలని ఆదేశించారు.

విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తాం : డీవైఈఓ సుభద్ర

జగ్గంపేట: జగ్గంపేటలో అర్ధాంతరంగా మూసివేస్తున్న రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వేరే పాఠశాలలో ప్రవేశాలు కల్పిస్తామని పిఠాపురం డీవైఈఓ సుభద్ర తెలిపారు. జగ్గంపేటలో రవీంద్ర భారతి స్కూల్ మూసివేతపై శుక్రవారం ఆమె విచారణ చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలను నిబంధనలకు విరుద్ధంగా మూసి వేసేందుకు యాజమాన్యం ప్రయత్నించిందని ఆమె తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎంఈఓ ఆర్.స్వామి పాల్గొన్నారు.

గ్రామాలకు ఉపాధి కళ

- కూలీల బతుకుల్లో ఉపాధి హామీ వెలుగులు
- మరోపక్క గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు
- ఉద్యాన తోటల పెంపకంతో రైతులకు అండ
- రోడ్డు పక్కన భారీగా మొక్కల పెంపకం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కాకినాడ సిటీ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం చేపడుతున్న పనులు గ్రామీణ కూలీల బతుకుల్లో వెలుగులు నింపుతున్నాయి. మరో పక్క పల్లెల్లో ప్రగతి వెల్లివిరుస్తోంది. ఈ పథకం నిధులతో గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు, భవన నిర్మాణాలు చేపడుతున్నారు. పథకం అమల్లోకి వచ్చాక వలసలు తగ్గాయి. ఉపాధి హామీ కింద వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉపాధి కూలీలకు ఆర్థిక భరోసా ఏర్పడటంతో కొనుగోలు సామర్థ్యం పెరిగింది. ఉపాధి నిధులతో సీసీ డ్రైన్లు, రోడ్లతో పాటు గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు, విద్యాశాఖ కాంపౌండ్ వాల్స్ నిర్మాణ పనులను చేపడుతున్నారు.

కనీస వేతనం

జిల్లాలో 20 మండలాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. మధ్యాహ్నం మరొక పనికి వెళుతున్నారు. ఉపాధి పనులకు రోజుకు కనీసం రూ. 257 వేతనం అందుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇతర పనులకు వెళ్లడం ద్వారా అదనపు ఆదాయం కూడా పొందుతున్నారు. భార్యాభర్తలిద్దరూ పనులకు వెళితే రూ.వెయ్యి వరకు సంపాదిస్తున్నారు.

వ్యవసాయ రంగం అభివృద్ధి

- ఉపాధి పథకంలో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.
- పంట కాలువలు తీయడం, పూడికతీత, చెరువుల్లో మట్టి తీయడం, పొలాలకు రోడ్లు, వేయడం, చెక్ డ్యాంల నిర్మాణం వంటి పనులు చేపడుతున్నారు.
- రోడ్లుకు ఇరువైపులా మొక్కలు నాటుతున్నారు. గడచిన నాలుగేళ్లలో 1446.79 కిలోమీటర్ల పొడవునా 5.78 లక్షల మొక్కలు నాటారు.
- చిన్న సన్నకారు రైతుల భూముల్లో పండ్ల తోటల్ని పెంచుతున్నారు. నాలుగేళ్లలో రూ. 4.44 కోట్లతో 309.92 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు.
- అర్హులైన చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో ఉచితంగా బోర్లు వేస్తున్నారు.
- రూ. 29.66 కోట్లతో 1449 బోర్లు మంజూరు కాగా 2020 నుంచి ఇప్పటి వరకు 786 బోర్లు వేశారు.

80 లక్షల పని దినాలు లక్ష్యం



ఉపాధి హామీ పథకంతో వలసలు కట్టడి చేయగలుగుతున్నాం. కూలీలకు పనుల కల్పిస్తున్నాం. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందేలా పనులు గుర్తించి పూర్తి చేస్తున్నాం. అడిగిన వారికి లేదనకుండా పనులు కల్పిస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో 80 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యాంగా నిర్దేశించాం.

– అడపా వెంకటలక్ష్మి, డ్వామా పీడీ.,

ఈ ఏడాది చెల్లించిన వేతనాలు	: రూ. 118.19 కోట్లు
పండ్ల తోటలు పెంపకం	: 309.92 ఎకరాల్లో
రోడ్ల కిరువైపులా నాటిన మొక్కలు	: 5.78 లక్షలు
వైఎస్సార్ జలకళలో వేసిన బోర్లు	: 786
సీసీ డ్రెయిన్ల నిర్మాణాలకు	: రూ.361.30 కోట్లు
ఇళ్ల స్థలాల అభివృద్ధికి..	: రూ. 870.77 కోట్లు
ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు	: రూ.1,249.40 కోట్లు



నాలుగేళ్లలో కల్పించిన పని దినాలు

సంవత్సరం	పనిదినాలు (లక్షల్లో)
2019–20	74.21
2020–21	82.88
2021–22	77.66
2022–23	58.47
2023–24	48.65

ప్రజలకు నాణ్యమైన విద్య, ఆరోగ్య సేవలు

దిశ సమావేశంలో ఎంపీ వంగా గీత

కాకినాడ సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న ఆరోగ్య, సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు ప్రజలకు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చయాలని ఎంపీ వంగా గీత కోరారు. జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ నాణ్యమైన విద్య, ఆరోగ్య సేవలు అందేలా చూడాలన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్, ఫ్యామిలీ డాక్టర్ పథకాలను అంకిత భావనతో అమలు చేయాలన్నారు. తద్వారా ఆరోగ్యవంతమైన మానవ సంపదను అందించాలన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలు వేసే పనులు ముమ్మరం చేయాలన్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామ్ కౌసల్ యోజన ద్వారా మహిళలు ఆర్థిక శక్తులుగాను, వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎంపీ లాడ్స్ నిధులతో చేపట్టిన పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని కోరారు. జిల్లాలో దాదాపు రూ. 30 కోట్లతో చేపట్టిన ఆసుపత్రి భవనాల నిర్మాణాలలో నాణ్యత పాటించాలన్నారు. రూ. 6 కోట్లతో జీజీహెచ్‌లో మెరుగైన సేవలను కల్పించనున్నామన్నారు. జిల్లాలో చేపట్టిన ఫీవర్ సర్వే, డెంగీ సర్వే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ కృతికా శుక్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అన్ని పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేశామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీలలో ప్రతి నెలా నిర్దిష్ట తేదీన అభివృద్ధి కమిటీల సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రజాప్రతినిధులు తమ ప్రాంతాల్లోని పలు అంశాలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వాటిని సత్వరం పరిష్కరించేందుకు కలెక్టర్ అధికారులకు ఆదేశాలిచ్చారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీ సీఈవో ఎ రమణారెడ్డి, డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మి, డీఎంఅండ్‌హెచ్‌వో ఆర్ రమేష్, డీసీహెచ్ఎస్ విష్ణువర్ధని, డీఆర్‌డీఏ పీడీ కె శ్రీరమణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పథకాలపై సమీక్షిస్తున్న ఎంపీ వంగా గీత, చిత్రంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కలెక్టర్ కృతికా శుక్లాలు

మహిళల్లో రక్తహీనతపై అవగాహన

పీఅండ్‌జీ, ఫాగ్ సీ, జీజీహెచ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పరీక్షలు



మహిళ నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది. చిత్రంలో ఎంఎల్‌ఏ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

కాకినాడ క్రైం: రక్తహీనత ప్రసవ వేళల్లో ప్రమాద ఘంటిక మోగిస్తోంది. ఈ కారణంగానే మాతృమరణాలు సంభవిస్తున్నాయి. ఈ రక్తహీనత మరణాల నివారణకు పీఅండ్‌జీ హెల్త్ సంస్థ ముందుకు వచ్చింది. దేశ వ్యాప్త కార్యక్రమానికి శ్రీ కారం చుట్టింది. ఫాగ్‌సీ ఫెడరేషన్ ఆఫ్ ఆబ్‌స్ట్రిక్స్ అండ్ గైనకాలజీ సొసైటీస్ ఆఫ్ ఇండియా) సంయుక్త ఆధ్వర్యంలో ఈ సంస్థ ఈ దిశగా అడుగులేస్తోంది. ఇందులో భాగంగా కాకినాడ జీజీహెచ్‌లో పీఅండ్‌జీ హెల్త్ సౌజన్యంతో, ఫాగ్‌సీ, జీజీహెచ్ యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత రక్త, ఆరోగ్య పరీక్షలు నిర్వహించింది. ఈ కార్యక్రమాల్లో ఎంపీ వంగా గీత, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

150 మంది మహిళలకు...

కాకినాడ జీజీహెచ్‌లో 150 మంది మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఒక్కో మహిళకు రూ.2500 విలువైన పరీక్షలు ఉచితంగా చేశారు. రక్త పరీక్షల నిర్వహణ అనంతరం హోటల్ జీఆర్‌టీ గ్రాండ్‌లో సంస్థ సీఎంఈ (కంటిన్యూస్ మెడికల్ ఎడ్యుకేషన్) నిర్వహించింది. ఎంపీ వంగా గీత ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.. ఫాగ్ సీ కాకినాడ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ అక్కమాంబ, డాక్టర్ గీత శ్రీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. సెంట్రల్ ఫాగ్‌సీ ప్రెసిడెంట్ హృషికేష్ పాయ్, సెక్రటరీ జనరల్ డాక్టర్ మాధవి పటేల్, వైస్ ప్రెసిడెంట్‌లు డాక్టర్ సంపద కుమారి, డాక్టర్ యశోదర, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ జితేంద్ర, చారులతలు సెంట్రల్ ఫాగ్ సీ బృందం నుంచి ఈ సీఎంఈలో పాల్గొన్నారు. 'బోలో ఇండియా నా నా ఎనీమియా' నినాదంతో కార్యక్రమాన్ని ఆరు నెలల క్రితం ప్రారంభించామని వారు చెప్పారు. నిరంతరాయ సేవలందించిన సీనియర్ గైనికాలజిస్టు డాక్టర్ జగదీశ్వరికి అవార్డు బహూకరించారు.

సురక్షిత సమాజ స్థాపనకు వారధి

- నేరాలకు మోసపోవద్దని పిలుపు
- ఎస్పీ సతీష్ కుమార్

తుని రూరల్: శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తున్న పోలీసులు ప్రజలకు మిత్రులేనని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి తుని మండలం వి.కొత్తూరులో రూరల్ పోలీస్‌ల ఆధ్వర్యంలో వారధి కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ చదువుతోనే పేదరికం పోయి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సురక్షితమైన సమాజం స్థాపించేందుకే వారధి కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మద్యం సేవించడం, హెల్మెట్ ధరించకుండా వాహనాలను నడపడం ప్రమాదకరమన్నారు. ఈ ఏడాది జిల్లా కేంద్రం కాకినాడ, పెద్దాపురంలో 144 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 125 మంది మరణించారన్నారు. ప్రమాదాల్లో 88శాతం మద్యం సేవించి వాహనాలు నడపడంవల్లే జరిగాయన్నారు. సాంకేతికత పెరిగినట్టే సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. డబ్బు జమ చేసేందుకు బ్యాంకులు, వ్యక్తులు క్యూ ఆర్ కోడ్, ఓటీపీలు అడగరన్నారు. అటువంటి మోసపూరిత ఫోన్లు, ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్‌లను నమ్మవద్దన్నారు. గ్రామాల్లో కుల, మత ఘర్షణలతో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతాదన్నారు. అటువంటి ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. సాంప్రదాయ పండగల పేరుతో పేకాట, గుండాట, కోడి పందాలు, తదితర వ్యసనాలకు గ్రామీణులు, యువత బలికావదన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు ఎల్‌హెచ్ఎంఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాలుగైదు రోజులు ఊర్లు వెళ్లే కుటుంబాలు ఈ యాప్‌తో సురక్షితంగా ఇంటికి రక్షణ లభిస్తుందన్నారు. . పోలీసులంటే భయపడాల్సిన అవసరంలేదన్నారు. పోలీసులు శత్రువులు కాదని, ప్రజలకు రక్షణగా నిలిచే మిత్రులన్నారు. కిందిస్థాయిలో న్యాయం జరక్కపోతే ఏ సమయంలోనైన తనను కలవచ్చని ఎస్పీ చెప్పారు. జాతీయ రహదారిపై వైజంక్షన్‌లో సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దుంగల నాగేశ్వరరావు కోరారు. తుని రూరల్, పట్టణ సీఐలు సన్యాసిరావు, నాగదుర్గారావు, తుని రూరల్, కోటనందూరు ఎస్సైలు విజయబాబు, స్వామినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, గ్రామస్తులు పాల్గొన్నారు.



వారధి కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ సతీష్ కుమార్

పవన్ వ్యాఖ్యలు దుర్మార్గం: ఎమ్మెల్యే కన్నబాబు



కాకినాడ సిటీ: వలంటీర్ వ్యవస్థపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు చాలా దుర్మార్గమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు త్రీవంగా విమర్శించారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయం వద్ద ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వాన్ని ఏదో విధంగా దెబ్బతీసేలా బురద చల్లాలని చంద్రబాబు, పవన్ ప్రయత్నిస్తున్నారు. సీఎం జగన్ మనో సంకల్పం, వలంటీర్ల ఆత్మస్థైర్యాన్ని వారి యత్నాలు దెబ్బతీయలేవన్నారు. వారి సంకల్పం ఎప్పటికీ నెరవేరదని కన్నబాబు అన్నారు. వలంటీర్ల సేవలు, కష్టాలను స్వయంగా చూస్తున్నాం కాబట్టే ప్రజాప్రతినిధులంతా మద్దతు ఇస్తున్నామన్నారు. జెడ్పీ సమావేశంలో ప్రత్యేక తీర్మానం చేశామన్నారు. ప్రజలు మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జంగా గగారిన్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌వి దిగజారుడు రాజకీయాలు : మంత్రి వేణు



కాకినాడ సిటీ: రాజకీయ అనుభవం లేని పవన్‌కల్యాణ్ అవగాహనలేమితో వలంటీర్లను కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేయడం క్షమించరాని విషయమని రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి వేణుగోపాలకృష్ణ అన్నారు. జెడ్పీ కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాగుతున్న సుభిక్షమైన పాలనను విచ్ఛిన్నం చేసేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారన్నారు. అందులో భాగంగానే వలంటీర్ల వ్యవస్థపై కోర్టుకు వెళ్తానంటున్నారన్నారు. గ్రామాలకు వెళ్లి వలంటీర్ల ద్వారా ప్రజలు పొందుతున్న సేవలను తెలుసుకోవాలని జనసేన అధినేతకు హితవు పలికారు. చంద్రబాబు స్క్రిప్ట్ ఇస్తే సినిమా డైలాగులా మాట్లాడడం తగదన్నారు. కుటుంబానికి ఉన్న గౌరవాన్ని పోగొట్టుకునేలా దిగజారి మాట్లాడడం సరికాదన్నారు. చంద్రబాబు స్క్రిప్ట్‌ను చదివేసి తిరిగి ఫాం హౌస్‌కు వెళ్లిపోయే పవన్‌కు ప్రజల సమస్యలు ఏం తెలుసన్నారు. ప్యాకేజీ కోసమే చంద్రబాబు చెప్పినట్లు మాట్లాడుతున్నారని మంత్రి విమర్శించారు.

సత్యగిరులకు నిరంతరాయ వెలుగులు

- పూర్తి కావస్తున్న సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు
- పనులను పరిశీలించిన ఈఓ ఆజాద్

అన్నవరం: అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి ఇకపై నిరంతరాయంగా విద్యుత్ వెలుగులు ప్రసరించనున్నాయి. దేవస్థానంలో రూ.3.75 కోట్లతో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) నిర్మిస్తున్న ఇండోర్ 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు 75 శాతం పూర్తయ్యాయి. దీని నిర్మాణానికి గత జనవరి 31న శంకుస్థాపన జరిగింది. అన్నవరం కొండ మీద నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రత్నగిరిపై విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణం పూర్తయితే దేవస్థానంలోని సత్రాలు, వ్రతమండపాలు, ఇతర భవనాలతో పాటు భవిష్యత్‌లో నిర్మించనున్న వివిధ నిర్మాణాలకు కూడా పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా చేయవచ్చు. మంచినీటి సరఫరాకు కూడా ఇబ్బందులు ఉండవని అధికారులు తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను ట్రాన్స్‌కో, దేవస్థానం విద్యుత్ శాఖ అధికారులతో కలిసి దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ శుక్రవారం పరిశీలించారు.

ఈఓ సూచనలు

దిగువన దేవస్థానం హైస్కూల్ సమీపంలో 33 కేవీ విద్యుత్ లైన్ నుంచి రత్నగిరిపై నిర్మిస్తున్న సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరాకు ఎత్తయిన టవర్లు నిర్మించి విద్యుత్ సరఫరా చేయాలని ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారు. స్తంభాల ద్వారా విద్యుత్ లైన్ నిర్మిస్తే తక్కువ ఎత్తులో నిర్మించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు మార్గ మధ్యలో చెట్లు కొట్టేయాల్సి వస్తుంది. ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉంటుంది. అందువలన సుమారు 60 అడుగుల ఎత్తులో టవర్లు నిర్మించాలని ఈఓ సూచించారు. దీని వలన ఒక్క చెట్టు కూడా కొట్టే అవసరం ఉండదన్నారు.



టవర్స్ ద్వారా విద్యుత్ లైన్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఈఓ అజాద్, డీఈ సూర్యనారాయణ, సబ్‌స్టేషన్ కాంట్రాక్టర్ ఇసుమంత్, విశ్రాంత ఏడీఈ రాంబాబు

పూర్తి కానున్న పనులు

దేవస్థానం సీఆర్వో ఆఫీసు పక్కన 120 అడుగుల పొడవు, 80 అడుగుల వెడల్పు, 1048 గజాల స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మాణం జరుగుతోంది. నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. సబ్‌స్టేషన్ భవనంలో విద్యుత్ మిషన్లు అమర్చే పనులు చేపట్టాల్సి ఉందని డీఈ సూర్యనారాయణ శుక్రవారం సాక్షికి తెలిపారు. టవర్ల ద్వారా దిగువ నుంచి రత్నగిరికి లైన్ వేయాలన్న ఈఓ ఆదేశాలను ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృధ్వీతేజ దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించారన్నారు. వచ్చే నెలాఖరుకు సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తవుతుందని వివరించారు. జీవీఎస్ ప్రాజెక్ట్స్ ప్రవేట్ లిమిటెడ్ జేఎండీ సుమంత్, విశ్రాంత ఏడీఈ జీ రాంబాబు పనుల పరిశీలనలో పాల్గొన్నారు.



నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ భవనం

క్లుప్తంగా

నిత్యాన్నదాన సత్రానికి రూ.40 లక్షల విరాళం



దాతలకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్మిస్తున్న అన్నదాన సత్రానికి హైదరాబాద్‌కు చెందిన అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిర్వాహకులు శుక్రవారం రూ.40 లక్షల విరాళం సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు చేతుల మీదుగా ఈ మొత్తాన్ని అందజేశారు. వాడపల్లి వెంకన్న సన్నిధిలో సుమారు రూ.5.50 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణానికి ఇటీవలే శంకుస్థాపన చేశారు. దీనికి తమ వంతు విరాళం అందజేసిన అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిర్వాహకులకు చైర్మన్, ఈఓలు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేసి, అభినందించారు.

చెంబు, పాత్రంతో దాడి.. భర్త హతం

అయినవిల్లి: తాగుడుకు బానిసై కుటుంబ సభ్యులతో తరచూ గొడవలు పడుతున్న భర్త.. భార్య చేతిలో హతమయ్యాడు. సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్సై ఎస్.నాగేశ్వరరావు, స్థానికుల కథనం ప్రకారం.. అయినవిల్లిలంకకు చెందిన ఇసుకపట్ల రామకృష్ణ (34) కొబ్బరి దింపు తీస్తూ జీవనం సాగిస్తున్నాడు. తాగుడుకు బానిసైన అతడు తరచూ ఇంట్లో భార్య సత్యనారాయణమ్మ, కుమార్తె అఖిలశ్రీ, కుటుంబ సభ్యులతో గొడవ పడుతూండేవాడు. గురువారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన రామకృష్ణ.. భోజనం పెట్టమంటూ భార్య, కుమార్తెలను అసభ్యకరంగా దుర్భాషలాడాడు. దీంతో విసుగు చెందిన సత్యనారాయణమ్మ.. భర్త రామకృష్ణ తలపై చెంబు, సన్నికల్లు పాత్రంతో మోదింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన రామకృష్ణ అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. రామకృష్ణ తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. రామకృష్ణ మృతదేహానికి పంచానామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం అమలాపురంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతడి కుటుంబ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

సేవా సైన్యానికి మద్దతు

- వలంటీర్లకు భరోసానిస్తూ జెడ్పీ సమావేశంలో తీర్మానం
- వారిపై దుష్ప్రచారాన్ని ఖండించిన నేతలు
- వ్యవసాయం, ఇరిగేషన్, సీజనల్ వ్యాధులపై చర్చ

కాకినాడ సిటీ: గ్రామ/వార్డు వలంటీర్లపై దుష్ప్రచారాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని, వారికి మద్దతుగా నిలవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన శుక్రవారం ఈ సమావేశం నిర్వహించారు. వలంటీర్ వ్యవస్థ, ఖరీఫ్ సాగు ప్రణాళిక, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడం, ఇరిగేషన్ కార్యాచరణ, కౌలు రైతులకు రుణాలు, సీజనల్ వ్యాధుల కట్టడి, విద్యుత్ సరఫరా వ్యవస్థలు, ఉపాధి హామీ పథకం పనులు తదితర అంశాలపై చర్చించారు. ఆయా శాఖలకు సంబంధించి తమ ప్రాంత అంశాలను జెడ్పీటీసీ సభ్యులు లేవనెత్తగా అధికారులు వివరణ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణను వివరించారు.

వెదజల్లు సాగు మేలు

ఖరీఫ్‌ను విజయవంతంగా ముగించేందుకు చేపట్టాల్సిన కార్యచరణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. లోటు వర్షపాతం, ఖరీఫ్ ప్రారంభ పనులపై ప్రభావం, విత్తనాలు, ఎరువుల అందుబాటు, సాగునీటి కాలువల ద్వారా నీటి ప్రవాహం ఆయకట్టు చిట్టచివరి వరకూ చేరేందుకు చేపట్టాల్సిన పనులు, సీసీఆర్‌సీ కార్డులు, కౌలు రైతులకు రుణాలు, కాలువల్లో తూటికాడ, గుర్రపుడెక్క తొలగింపు, డ్రైన్ల ఆధునీకరణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఇప్పటి వరకూ లోటు వర్షపాతం నమోదైందని, ఇప్పుడిప్పుడే వానలు కురుస్తున్నాయని, ఈ నేపథ్యంలో నారుమళ్లు కాకుండా నేరుగా వెదజల్లే పద్ధతి అనుసరిస్తే బాగుంటుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. దీనిపై గ్రామసభలు పెట్టి, రైతులకు అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. మెట్ట ప్రాంతాల్లో రాగుల వంటి చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నామని, విత్తనాలు కూడా సరఫరా చేశామని తెలిపారు. భూసార పరీక్షల నమూనాలు 10 వేల వరకూ తీశామన్నారు. కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ, జిల్లాలోని కౌలు రైతులకు గత ఏడాది 40 వేల సీసీఆర్‌సీ కార్డులు అందించామని, ఈసారి ప్రతి కౌలు రైతుకూ కార్డు అందించి, త్వరితగతిన రుణాల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే 36 వేల కార్డులు అందించామని వెల్లడించారు. భూ యజమానులు దూర ప్రాంతంలో ఉంటే వీడియో కాల్ ద్వారా అంగీకారం తీసుకునే వెసులుబాటు కూడా ఉందన్నారు. కౌలు రైతులను గుర్తించేందుకు వలంటీర్, వీఏఏ ఇంటింటి సర్వే చేస్తున్నారని చెప్పారు.

వలంటీర్లపై ఆరోపణలకు ఖండన

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ, వలంటీర్ వ్యవస్థపై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వీటిని ఖండించడంతో పాటు మేమున్నామంటూ వలంటీర్లకు భరోసా కల్పించేలా, ఈ వ్యవస్థను తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపేలా తీర్మానం చేయాలని కోరారు. దీనిపై రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ, ప్రతిపక్ష నేతగా నిర్వహించిన ప్రజాసంకల్ప పాదయాత్రలో దాదాపు 2 కోట్ల మంది ప్రజలను కలిసి, వారి కష్టాలను గుర్తించి, వాటిని పరిష్కరించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్/సచివాలయ వ్యవస్థలను తీసుకువచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసిన ఈ వ్యవస్థలు ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఇలాంటి వ్యవస్థపై కొందరు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ, వలంటీర్లకు అందరూ మద్దతుగా నిలవాల్సిన అవసరముందని అన్నారు. ఈ తీర్మానానికి మద్దతుగా కాకినాడ ఎంపీ వంగా గీత, ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్యేలు, పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడారు. అనంతరం ఇది చారిత్రక తీర్మానమని పేర్కొంటూ జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు సమావేశంలో ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రులు వేణు, దాడిశెట్టి రాజా, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎంపీ వంగా గీత, విప్ జగ్గిరెడ్డి, కలెక్టర్లు కృతికా శుక్లా, హిమాన్షు శుక్లా

వ్యాధుల కట్టడికి చర్యలు

సీజనల్ వ్యాధులతో పాటు డెంగీ కట్టడికి క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలు, పారిశుధ్యం, ఇతర ప్రత్యేక కార్యక్రమాలు, ఆస్పత్రుల్లో ర్యాపిడ్ కిట్ల అందుబాటు తదితర అంశాలపై కూడా జెడ్పీ సమావేశంలో చర్చించారు. కాకినాడ రూరల్, కోటనందూరు తదితర ప్రాంతాల్లో ఫైలేరియా కేసులు నమోదవుతున్నందున జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, సర్వే చేయాలని నిర్ణయించారు. వైద్య సేవలు పొందేందుకు పేదలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించారని మంత్రి వేణు అన్నారు. ఈ నాలుగేళ్లలో రికార్డు స్థాయిలో దాదాపు 51 వేల మంది వైద్య సిబ్బందిని నియమించారని చెప్పారు. వైద్య సేవల్లో ఎక్కడా లోటుపాట్లు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఖాళీలను భర్తీ చేశామని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఈ సందర్భంగా డెంగీ నివారణ మాసోత్సవాలపై వైద్య, ఆరోగ్య శాఖ రూపొందించిన పోస్టర్లను మంత్రులు రాజా, వేణు, విప్ జగ్గిరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఆవిష్కరించారు.

నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద ఇళ్ల మంజూరు, గ్రౌండింగ్, లే అవుట్లలో మౌలిక వసతుల కల్పన, ఉపాధి హామీ పథకం కింద ప్లాంటేషన్ పనులపై సమావేశంలో చర్చించారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు కృతికా శుక్లా, హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ సమావేశానికి తొలిసారి హాజరైన ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావును మంత్రులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు. సమావేశంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, జెడ్పీ వైస్ చైర్మన్లు బుర్రా అనుబాబు, ఎం.పద్మలత, సీఈఓ ఎ.రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కియా సెల్టోస్ 2.0 కారు మార్కెట్‌లోకి విడుదల

రాజమహేంద్రవరం సిటీ: సరికొత్త ఫీచర్లతో రూపొందించిన కియా సెల్టోస్ 2.0 కారును మార్కెట్‌లోకి విడుదల చేసినట్టు కంటిపూడి గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు తెలిపారు. రాజమహేంద్రవరం, కాకినాడ కంటిపూడి కియా షోరూముల నుంచి ఈ కారును శుక్రవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ కారులో 32 సేఫ్టీ ఫీచర్లు, 17 అటానమస్ అడాస్ లెవెల్ 2 ఫీచర్లు, పనోరమిక్ సన్ రూఫ్, డ్యూయల్ స్క్రీన్ పనోరమిక్ డిస్‌ప్లే, అత్యాధునిక 67 కియా కనెక్ట్ ఫీచర్స్ డ్యూయల్ జోన్ ఆటోమేటిక్ ఏసీ, 6 ఎయిర్ బ్యాగ్‌ల వంటి అనేక ఫీచర్లు ఉన్నాయని సర్వారాయుడు చెప్పారు. పెట్రోల్, డీజిల్ వెర్షన్లలో 5 ట్రాన్స్మిషన్స్‌తో అందుబాటులో ఉందన్నారు. విడుదలయిన మూడేళ్లలో 5 లక్షల సెల్టోస్ కార్లు, 10 లక్షల కియా కార్లు అమ్ముడయ్యాయని తెలిపారు. కే కోడ్ ద్వారా బుక్ చేసుకునే వినియోగదారులకు డెలివరీలో ప్రాధాన్యం లభిస్తుందన్నారు. బుకింగ్స్ ప్రారంభమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో కంటిపూడి గ్రూప్ డైరెక్టర్లు కె.వినయ్‌బాబు, ఎం.జగన్, సీహెచ్ సత్యనారాయణమూర్తి (చినబాబు), కె.మన్మోహనరామ్, కియా ఏరియా మేనేజర్ గౌతమ్ సాయి, మేనేజర్ కామేష్ తదితరులు పాల్గొన్నారు.



కియా సెల్టోస్ 2.0 కారును మార్కెట్‌లోకి విడుదల చేసిన కంటిపూడి సర్వారాయుడు

పవన్ మైండ్‌లో చిప్ పాడైపోయింది

- ప్రతిపక్షంలోనైనా ఉండాలంటే ప్రవర్తన మార్చుకోవాలి
- రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

నిడదవోలు: వారాహి యాత్రలో పవన్ కల్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలు చూస్తుంటే ఆయన మైండ్‌లో చిప్ పాడైనట్లు అర్థమవుతోందని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారికి శుక్రవారం ఆయన ఆషాఢం సారె సమర్పించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, పంచాయతీరాజ్ వ్యవస్థ ఉన్నప్పుడు సచివాలయాలు ఎందుకంటూ పవన్ అసంబద్ధంగా మాట్లాడుతున్నారన్నారు. అర్థం లేని ప్రసంగాలు చేసి ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే తెలియదన్నారు. రాష్ట్ర అభివృద్ధిని పవన్ కోరుకోవడం లేదని, తిరోగమన దిశలో వెళ్లాలని చూస్తున్నారని అన్నారు. చంద్రబాబు తొత్తులుగా ఉన్న జేబులు కొట్టే ముఠా, జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకునే ముఠా కావాలని పవన్ కోరుకుంటున్నారని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నువ్వు అంటూ సంబోధించిన మాత్రాన ఆయన విలువ తగ్గదన్నారు. ఆయనను విమర్శిస్తే ఆకాశం మీద ఉమ్మి వేసినట్లేనన్నారు. అది నీమీదే పడుతుందన్న విషయం గ్రహించాలన్నారు. చంద్రబాబు అనే శనిని నెత్తిన పెట్టుకుని యాత్రలు చేసినంత కాలం పవన్ బతుకూ అలాగే ఉంటుందని దుయ్యబట్టారు. కనీసం ప్రతిపక్ష నాయకుడిగా అయినా ఉండాలంటే పవన్ కల్యాణ్ ఆలోచనా ధోరణి మారాలని మంత్రి హితవు పలికారు. ప్రతిపక్షంలోనైనా ఉంటానా అనే భయం చంద్రబాబుకు పట్టుకుందని, దీంతో రాజకీయంగా పవన్‌ను కూడా తప్పుదోవ పట్టిస్తున్నాడని అన్నారు. దేశంలోనే ఆదర్శంగా ఉన్న వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ప్రధాని సైతం మెచ్చుకున్నారని అన్నారు. ఈ వ్యవస్థల ద్వారా ప్రజలకు జరుగుతున్న మేలును గమనించి, వారిపై పవన్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్ ఆలోచనలు, విధానాలను అందుకోవాలంటే మీలో మార్పు రావాలని మంత్రి సత్యనారాయణ హితవు పలికారు. ఆయన వెంట ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు తదితరులున్నారు.

రూ.7 లక్షల అక్రమ మద్యం పట్టివేత

- రూ.5 లక్షల విలువైన 3 వాహనాల స్వాధీనం
- ముగ్గురు నిందితుల అరెస్టు



పట్టుబడిన మద్యాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఈబీ జిల్లా సూపరింటెండెంట్ పిట్టా సోమశేఖర్, సీఐ సుధ

నల్లజర్ల/దేవరపల్లి: గోవాలో కొనుగోలు చేసి, ప్రభుత్వానికి డ్యూటీ (సుంకం) చెల్లించకుండా అక్రమంగా తీసుకు వస్తున్న 80 కేసుల మద్యాన్ని స్థానిక డాల్ఫిన్స్ రోడ్డు సమీపాన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) అధికారులు శుక్రవారం మధ్యాహ్నం దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. దేవరపల్లిలోని ఎస్‌ఈబీ స్టేషన్ వద్ద రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌ఈబీ జిల్లా సూపరింటెండెంట్ పిట్టా సోమశేఖర్ ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. మొత్తం 60 కేసుల (976 బాటిల్స్) మద్యం, 20 కేసుల (480 బాటిల్స్) బీరు పట్టుబడ్డాయి. వీటి విలువ రూ.7 లక్షలుగా నిర్ధారించారు. వీటితో పాటు ఒక మినీ వ్యాన్, కారు, స్కూటర్ కూడా స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.5 లక్షలుంటుందని అంచనా వేశారు. మొత్తం 1456 బాటిల్స్ అక్రమంగా రవాణా చేస్తున్న నల్లజర్లకు చెందిన తాటికొండ కేదారేశ్వరరావు, తాటికొండ శ్రీనివాసరావు, నల్లజర్ల మండలం అచ్చన్నపాలేనికి చెందిన ఈటి శివకుమార్‌లను అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. దాడిలో ఎస్‌ఈబీ దేవరపల్లి సీఐ డి.సుధ, ఎస్సైలు జి.సుధీర్, ఎం.రామశేషయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్‌సెట్‌లో తేజస్వినికి 4వ ర్యాంక్



రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్షలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన కంచుమర్తి తేజస్విని రాష్ట్ర స్థాయి 4వ ర్యాంక్ కైవసం చేసుకుంది. గణితం విభాగంలో 150 మార్కులకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో తేజస్విని 90 మార్కులు సాధించి ఓపెన్ కేటగిరీలో ఈ ర్యాంక్ సాధించింది. తాను ఉపాధ్యాయ శిక్షణ పొందుతానని, అయితే గ్రూప్–1 సాధించాలన్నది లక్ష్యమని ఈ సందర్భంగా తేజస్విని తెలిపింది. ఆమె తండ్రి సాయి కిషోర్ ప్రైవేటు ఉద్యోగి కాగా, తల్లి శారద గృహిణి.

ఐటీఐలో రెండో విడత అడ్మిషన్లు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో రెండో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అడ్మిషన్ల కన్వీనర్ వేణుగోపాలవర్మ శుక్రవారం తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో ప్రభుత్వ లేదా ప్రైవేటు కళాశాల ఆప్షన్ తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐకి వచ్చే నెల 3, 4 తేదీల్లోను, ప్రైవేటు ఐటీఐలకు 5, 6, 7 తేదీల్లోను కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వివరించారు. సందేహాల నివృత్తికి 9494 688 516 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నానా కష్టాలూ పడి.. క్షేమంగా స్వస్థలానికి..

అమర్‌నాథ్ నుంచి తిరిగిన వచ్చిన జిల్లా వాసులు



స్వగ్రామానికి చేరుకున్న బద్రి బాబ్జీ తదితరులు

సాక్షి, అమలాపురం: అమర్‌నాథ్ యాత్రకు వెళ్లి, జమ్మూ కశ్మీర్‌లో చిక్కుకుపోయిన జిల్లా వాసులు శుక్రవారం స్వస్థలాలకు క్షేమంగా చేరుకున్నారు. జిల్లాలోని అమలాపురం, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాలకు చెందిన 45 మందితో పాటు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలకు చెందిన మరో 40 మంది యాత్రికులు ఈ నెల 7న అమర్‌నాథ్ యాత్రకు వెళ్లారు. వైష్ణోదేవి కాత్రా వెళ్లిన వీరు అక్కడి నుంచి అమర్‌నాథ్ వెళ్తున్న సమయంలో భారీ వర్షాలు కురవడంతో పాటు కొండచరియలు విరిగి పడ్డాయి. దీంతో వీరందరూ యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన బెతల్ బేస్ క్యాంప్ వద్ద చిక్కుకుపోయారు. ఒకవైపు భారీ వర్షం, మరోవైపు ఎముకలు కొరికే చలితో నానా కష్టాలూ పడ్డారు. మూడు రోజుల పాటు అక్కడే ఉండిపోయారు. యాత్రకు అనుమతిచ్చేది లేదని అధికారులు చెప్పడంతో వీరందరూ జమ్మూ వెళ్లి అక్కడి నుంచి స్వస్థలాలకు చేరాలని భావించారు. అయితే దారి అనుకూలించకపోవడంతో శ్రీనగర్ వెళ్లిపోయారు. కొందరు అక్కడి నుంచి తిరుగు ప్రయాణమవగా, మూడు రోజుల తరువాత వాతావరణం అనుకూలించడంతో యాత్రకు అనుమతి ఇచ్చారు. దీంతో కొందరు యాత్రికులు తిరిగి బెతల్ క్యాంపునకు చేరారు. అయితే మరోసారి భారీ వర్షాలు కురవడంతో అమర్‌నాథ్ యాత్రను ఒక రోజు నిలిపివేశారు. తిరిగి మర్నాడు అనుమతివ్వడంతో దర్శనం చేసుకున్నారు. అక్కడి నుంచి శ్రీనగర్ చేరుకుని, విమానంలో తొలుత ఢిల్లీకి, అక్కడి నుంచి విశాఖ చేరుకుని రోడ్డు మార్గంలో స్వగ్రామాలకు క్షేమంగా చేరుకున్నారు. బెతల్ క్యాంపులో చలి తట్టుకోలేకపోయామని, కానీ అక్కడ తాగేందుకు వేడి నీరు, ఆహారం అందించారని వైఎస్సార్ సీపీ ఉప్పలగుప్తం మండల అధ్యక్షుడు బద్రి బాబ్జీ 'సాక్షి'కి చెప్పారు.

ట్రాలీ ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

- నుజ్జునుజ్జయిన దేహం
- భయభ్రాంతులకు గురైన స్థానికులు, ప్రయాణికులు



మృతురాలు చిట్టమ్మ (పాత చిత్రం)

గండేపల్లి: ట్రాలీ ఢీకొని ఓ వృద్ధురాలు దుర్మరణం పాలైంది. మండలంలోని నీలాద్రిరావుపేట వద్ద పదహారో నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రమాదం స్థానికులను, ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేసింది. గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్ కథనం ప్రకారం.. నీలాద్రిరావుపేటకు చెందిన మట్టాడి చిట్టమ్మ (75), ఆమె కుమార్తె సరోజని జగ్గంపేట వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నారు. అదే సమయంలో రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేట వైపు వెళ్తున్న మోటార్ సైకిల్ ఢీకొనడంతో చిట్టమ్మ రోడ్డుపై పడిపోయింది. సరిగ్గా అదే సమయానికి వేగంగా వస్తున్న ట్రాలీ ఆమెపై నుంచి దూసుకుపోయింది. ట్రాలీ చక్రాల మధ్య నలిగిపోయి చిట్టమ్మ శరీరం నుజ్జునుజ్జయిపోయింది. శరీరం భాగాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ఒంటిపై దుస్తులు తప్ప కనీసం మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించేందుకు కూడా వీలు లేనంతగా మాంసపు ముద్దగా మారిపోయింది. పోలీసులు ఆ మాంసం ముద్దనే మూట కట్టి పోస్టుమార్టానికి తరలించారు. శవపంచనామా నిర్వహించి, మృతురాలి కుమార్తె సరోజని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. చిట్టమ్మ దారుణ మరణంతో ప్రమాద స్థలంలో బంధువులు బోరున విలపించారు. ప్రమాదానికి కారణమైన ట్రాలీని డ్రైవర్ ఆపకుండా పరారయ్యేందుకు ప్రయత్నించగా, స్థానికులు వెంబడించారు. ఆదిత్య హాస్పిటల్ వద్ద అడ్డుకుని, జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావుకు సమాచారం అందజేశారు. ఆయన వెంటనే స్పందించి, రోడ్డు సేఫ్టీ సిబ్బందిని అప్రమత్తం చేసి ట్రాలీని, డ్రైవర్‌ను గండేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సంఘటన స్థలంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

17న హ్యాండ్‌బాల్ అకాడమీకి ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యాన గుంటూరు జిల్లాలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ అకాడమీలో ప్రవేశాలకు ఈ నెల 17న తెనాలి మినీ స్టేడియంలో ఎంపికలు నిర్వహిస్తున్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ షేక్ ఇమ్రాన్ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ ఎంపికలకు 14 నుంచి 16 సంవత్సరాల బాలురు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు రాష్ట్ర లేదా జాతీయ స్థాయి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్, సివిల్ సర్జన్ జారీ చేసిన మెడికల్ సర్టిఫికెట్, 5 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలని, వివరాలకు 89196 42248 నంబరులో సంప్రదించాలని సూచించారు.

4.2 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించిన అధికారులు

కాకినాడ సిటీ: తూరంగిలోని వీఎస్ రాజు అండ్ సన్స్ గోడౌన్‌లో 88 బస్తాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 4,200 కిలోల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ఈ బియ్యాన్ని నేరుగా రేషన్ షాపుల నుంచి సరఫరా చేస్తున్నారా లేక ఎండీయూ వాహనదారులు కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి, ఇక్కడ అమ్ముతున్నారా అనే అంశంపై ఆరా తీస్తున్నారు. ఈ గోడౌన్ కోనాల శంకర్, వివేకానందరెడ్డికి సంబంధించినదని పౌరసరఫరాల అధికారులు ఆనంద్, మమత తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని మండల స్థాయి పాయింట్ గోదాముకు తరలించామని, వీటిని నిల్వ ఉంచిన వారిపై 6ఏ కేసులు నమోదు చేశామని వివరించారు.